# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 08-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **బుడమేరు గట్టు ఎత్తు పూర్తిస్థాయిలో పెంచి బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు.**
2. **విజయవాడ నగరాన్ని బుడమేరు వరద నుంచి కాపాడేందుకు శాశ్వత చర్యల్లో భాగంగా రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదన చేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**
3. **చిత్తూరు జిల్లా కాణిపాకంలో స్వయంభు వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.**
4. **నిరక్ష్యరాస్యత నిర్మూలనే లక్ష్యంగా ఈరోజు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**
5. **బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో కోస్తా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.**

==========================

బుడమేరు గట్టు ఎత్తు పూర్తిస్థాయిలో పెంచి బలోపేతం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు సూచించారు. పులివాగు పొంగుతుండటంతో మరింత వరద వచ్చే అవకాశముందని.. మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. వరద పరిస్థితి, సహాయక చర్యలపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. బుడమేరు గండ్లు పూడ్చివేత పనులను రేయింబవళ్లూ పర్యవేక్షించిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఆయన అభినందించారు. బుడమేరు గండ్లు పూడ్చివేత పనుల్లో పాల్గొన్న మంత్రితో పాటు జలవనరులశాఖ అధికారులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

-------------------------

విజయవాడ నగరాన్ని బుడమేరు వరద నుంచి కాపాడేందుకు శాశ్వత చర్యల్లో భాగంగా రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదన చేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నగరంలోని సింగ్ నగర్ పరిసరాల్లో వరద క్రమంగా తగ్గుతోందన్నారు. ముంపు ప్రాంతాల్లో మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి నారాయణ ఈ రోజు పర్యటించారు. ఇందిరా నాయక్ నగర్‌లో బాధితులను పరామర్శించారు. ఆహారం పంపిణీ, తాగునీటి సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. బుడమేరు

వరదకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో ఇబ్బంది రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొంటూ.

..వాయిస్.. 33 సెకను

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శ్రీకాకుళం జిల్లా అంతటా గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఒడిశాలో కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో ఉన్న నాగావళి, వంశధార, బహుదా, మహేంద్ర తనయ నదులు పొంగి ప్రవహిస్తున్నాయి.ఎల్ఎన్ పేట, కొత్తూరు, పోలాకి, జలుమూరు, సరుబుజ్జిలి, హిరమండలం, గార, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల పరిధిలో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. ముందు జాగ్రత్తగా శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్‌లో తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సీనియర్ అధికారులు తీర ప్రాంత మండలాల్లో పర్యవేక్షిస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

---------------------------

వాయుగుండం ప్రభావంతో విజయనగరం జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. నిన్న ఉదయం నుంచి జిల్లా వ్యాప్తంగా 44.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదయింది. అత్యధికంగా గుర్ల మండలంలో 102.6 మిల్లీమీటర్లు, నెల్లిమర్లలో 90, విజయనగరంలో 88.8, పూసపాటి రేగ, డెంకాడ మండలాల్లో 74.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో విజయనగరంలోని పెద్ద చెరువుకు గండి పడగా.. ట్యాంక్ బండ్ రహదారి మొత్తం జలమయమైంది. దిగువ ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

---------------------------

చిత్తూరు జిల్లాలో స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలను ఈ రోజు ప్రారంభించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య ధ్వజారోహణ జరిగింది. 21 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ రోజు రాత్రి హంస వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన వాహన సేవలైన మూషిక వాహన సేవ ఈ నెల 10వ తేదీ, రథోత్సవం 14వ తేదీన జరుగనున్నాయి.

---------------------------

అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. నిరక్షరాస్యత నిర్మూలన అంశానికి సంబంధించి 1965లో వివిధ దేశాల విద్యా మంత్రులతో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో జరిగిన ప్రపంచ స్థాయి సదస్సులో ఇందుకు బీజం పడగా... ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8వ తేదీన అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి విద్యా, విజ్ఞాన, సాంస్కృతిక విభాగం... యునెస్కో 1966లో ప్రకటించింది. వ్యక్తి నుంచి సమాజం వరకు అక్షరజ్ఞానం ఆవశ్యకతను గుర్తెరిగి, ఇందుకోసం తగురీతిలో ప్రయత్నాలు చేసే విధంగా ప్రజలు, ప్రభుత్వాలు, సంస్థలను కార్యోన్ముఖులను చేయడం అక్షరాస్యతా దినోత్సవ ప్రధాన లక్ష్యం.

---------------------------

విజయవాడ వరద బాధితుల కోసం కోటి రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపిస్తున్నట్టు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తిలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు నియోజకవర్గంలోని చాలామంది దాతలు ముందుకు వచ్చి చెక్కులు, నగదు అందించారని చెప్పారు. ఆ మొత్తాన్ని తానే స్వయంగా ముఖ్యమంత్రికి రేపు అందజేస్తానని తెలిపారు. ఈ నెల 11, 12 వ తేదీల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు అవసరమైన సామగ్రిని కూడా అందజేస్తానని సుధీర్ రెడ్డి తెలియజేశారు. దాతలు ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

---------------------------

వాయుగుండం ప్రభావంతో విశాఖపట్నంలో నిన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. గడచిన 24 గంటల్లో నగరంలో 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగంతో పాటు విశాఖ మహా నగర పాలక సంస్థ.. జీవీఎంసీ పరిధిలోని కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు చర్యలు తక్షణమే చేపట్టాలని కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కైలాసపురం, బర్మా కాలనీ,కప్పరాడ, ఎన్.ఏ.డి కొత్తరోడ్డు, ఆరిలోవ, గాజువాక ప్రాంతాల్లోని కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. తీరప్రాంత మత్స్యకార గ్రామాలు పెదజాలారిపేట, జాలారి ఎండాడ, భీమిలి నియోజకవర్గం పరిధిలోని మంగమరియపేట గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విశాఖ నుంచి విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. షెడ్యూల్ సమయం కంటే ఆలస్యంగా విమానాలు నడుపుతున్నట్టు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

---------------------------

తిరుమలలో యాత్రికుల రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 20 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. టోకెన్ రహిత సర్వదర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శనివారం స్వామి వారిని 83 వేల 960 మంది భక్తులు దర్శించుకోగా.. 32 వేల 342 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం 2 కోట్ల 96 లక్షల రూపాయలు వచ్చిందని తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి. శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....35 సెకన్లు....

---------------------------

పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. మచిలీపట్నం మండలం గుండుపాలెం, చిన్నాపురం, నెలకుర్రు, భోగిరెడ్డి పల్లి గ్రామాల పరిధిలో ముంపునకు గురైన పంట పొలాలను ఆయన ఈ రోజు పరిశీలించారు. రైతులతో

మాట్లాడి పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ.. అధిక వర్షాల కారణంగా వ్యవసాయ, ఆక్వా రంగాలకు బాగా నష్టం జరిగిందన్నారు. గత ప్రభుత్వం కాలువలు, డ్రెయిన్ల నిర్వహణ చేపట్టలేదని తెలిపారు. ప్రకాశం బ్యారేజీ నిర్మించాక ఇంతటి వరద ఉధృతి గతంలో ఎప్పుడు రాలేదని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని స్పష్టంచేశారు. ఈ నెల 10వ తేదీలోగా పంట నష్టం అంచనాలు రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి తెలిపారు.

---------------------------

కృష్ణా నదికి వరద ఉధృతి పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజీ ఇన్ ఫ్లో 3 లక్షల 94 వేల 430 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 4 లక్షల 5 వేల 996 క్యూసెక్కులుగా నమోదైంది. శ్రీశైలం జలాశయం వద్ద ఇన్ ఫ్లో 2 లక్షల 86 వేల క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 3 లక్షల 9 వేల క్యూసెక్కులుగా ఉంది. నాగార్జునసాగర్ వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 2 లక్షల 99 వేల క్యూసెక్కులుగా నమోదైంది. పులిచింతల వద్ద ఇన్ ఫ్లో 2 లక్షల 75 వేల క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 2 లక్షల 97 వేల క్యూసెక్కులుగా ఉంది. వర్షాలు, వరదల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.

======================